సాక్షి ప్రకాశం

మంగళవారం । 12 । మార్చి । 2024



వరాల వసంతం రంజాన్

ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ మాసం మొదలైంది. నేటి నుంచి రంజాన్ ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నారు.

- 8లో..



బైక్ అదుపు తప్పి ఇద్దరు మృతి

బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం సమీపంలో జరిగింది.

- 8లో..



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

మంగళవారం - ఇఫ్తార్ : సా॥ 6.24

బుధవారం - సహర్ : ఉ॥ 4.58



గ్లాస్‌లో వార్..!



జనసేనలో నేతల మధ్య ఆధిపత్య పోరు ముదిరి పాకాన పడింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే స్థాయి దాటి దాడి చేసే వరకూ వచ్చింది. మహిళానేతపై దాడి చేసి అడ్డువచ్చిన వారిని జిల్లా అధ్యక్షుడి అనుచరులు విచక్షణారహితంగా దాడి చేశారు. మహిళ అని చూడకుండా ఆమెపై చేయి చేసుకున్నారు. నడిరోడ్డులో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. దాడి విషయాన్ని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు సరికదా..పొత్తులతో బిజీగా ఉన్నాం.. ఎన్నికలు ముగిసిన తర్వాత చూసుకుందాంలే అంటూ ఈజీగా తీసుకున్నారు. అధినేత తీరుపై పార్టీ కేడర్ విస్తుపోతోంది. జిల్లా అధ్యక్షుడు రియాజ్ వర్గానికి మాజీ ఎమ్మెల్యే దామచర్ల అండదండలు ఉండడంతో పేట్రేగిపోతున్నారని బాధితురాలి వర్గం ఆరోపిస్తోంది. ఈ ఘటన జిల్లాలో సంచలనం రేకెత్తించింది.

- నేతల మధ్య ముదిరిన ఆధిపత్య పోరు
- జనసేన మహిళా నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణపై జిల్లా అధ్యక్షుని వర్గం దాడి
- కులం పేరుతో దూషించి.. చంపుతానని బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు
- టీడీపీ–జనసేన సమన్వయ కమిటీ వేదికగా దాడికి ప్లాన్
- మహిళా నేత మీద దాడిపై స్పందించని అధిష్టానం
- ఎన్నికల తరువాత చూద్దామంటూ ఈజీగా తీసుకున్న పవన్
- విస్తుపోతున్న పార్టీ కేడర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా జనసేనలో గ్రూపు తగాదాలు రోడ్డెక్కాయి. జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ , పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మధ్య పొసగడం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా సోషల్ మీడియా వేదికల మీద ఒకరి మీద మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం, సవాళ్లు విసురుకోవడం జరుగుతోంది. పార్టీకి సంబంధించి జిల్లాలో పెత్తనం సాగిస్తున్న రియాజ్ వర్గం పార్టీ సమావేశాలకు అరుణను ఆహ్వానించడం లేదు. ఒకవేళ పిలిచినా ప్రసంగించేందుకు అవకాశం ఇవ్వక పోవడం, చేతిలో ఉన్న మైకును సైతం లాక్కోవడం చేస్తున్నారు. ఎస్సీ మహిళ అని కూడా చూడకుండా తరచుగా అవమానాలకు గురిచేస్తున్నారు. ఈ విషయం గురించి అనేక సార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్ అండతో రియాజ్ వర్గం పేట్రేగిపోతోందని అరుణ వర్గం ఆరోపిస్తోంది.

టీడీపీ, జనసేన సమన్వయ సమావేశంలోనే దాడికి ప్లాన్...

ఆదివారం ఒంగోలులోని పీఏజీ కన్వెన్షన్ హాలులో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వచ్చిన అరుణను ప్రొటోకాల్ ప్రకారం వేదికపైకి ఆహ్వానించాల్సి ఉంది. అయితే ఆమెను పిలవలేదు సరికదా, కనీసం ప్రసంగించే అవకాశం కల్పించకుండా అవమానాలకు గురిచేశారు. సమావేశంలో ఎక్కడో చివరన ఆమెకు సీటు కేటాయించారు. దీనిని ఆమె ప్రశ్నించి ఉంటే సమావేశంలోనే దాడికి ప్లాన్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె మౌనంగా అక్కడి నుంచి వెళ్లి పోయారు. దాంతో అదే రోజు సాయంత్రం నాగులుప్పలపాడు మండలంలో జరిగే జెండా విష్కరణ కార్యక్రమంలో అరుణ మీద దాడి చేయాలని కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఇదంతా జనార్దన్ కనుసన్నల్లోనే జరిగినట్లు అరుణ వర్గానికి చెందిన పలువురు జనసేన కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కారును వెంబడించి... ఛాతిపై దాడి చేసి

నాగులప్పలపాడు మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ జండావిష్కరణ కార్యక్రమానికి సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే విజయ్ కుమార్‌తో కలిసి అరుణ వెళ్లారు. కార్యక్రమాలు పూర్తయ్యే సరికి రాత్రి 9 గంటలు దాటింది. తిరుగు ప్రయాణంలో దాసరివారిపాలెం గ్రామ శివారు వద్ద రియాజ్ అనుచరులు రాంబాబు, మాత్యాల కళ్యాణ్ తదితరులు అరుణ ప్రయాణిస్తున్న కారును అడ్డుకున్నారు. అరుణ అనుచరుడు చరణ్ మీద దాడికి దిగారు. అక్కడ నుంచి తప్పించుకొన్న అరుణ కారును వెంబడించారు. కనపర్తి గ్రామం వద్దకు రాగానే కారును ఆపి అరుణపై దాడికి దిగారు. ఛాతీపై చేయ్యేసి పిడిగుద్దులు కురిపించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ..నిన్ను చంపేస్తా అంటూ బెదిరించారు. ఇదంతా ఒక వ్యూహం ప్రకారమే జరిగినట్లు ఆమె ఆరోపిస్తున్నారు.

అధ్యక్ష్యా ఇలా అయితే ఎలా..

రాష్ట్ర అధికార ప్రతినిధి మీద దాడి జరిగినా ఖండించకపోవడమే కాకుండా ఇప్పుడు పొత్తులతో బిజీగా ఉన్నాను. ఎన్నికల తరువాత కూచొని మాట్లాడుదాంలే అని చెప్పడం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ చెప్పడం కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. సాక్షాత్తు రాష్ట్ర నాయకురాలికే పార్టీలో భద్రత లేకపోతే సామాన్య మహిళా కార్యకర్తల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో రియాజ్, అరుణ వర్గాల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుకు చెక్ పెట్టకుండా ఉండడం వల్లనే నేడు దాడుల వరకు పరిస్థితి వెళ్లిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ నాయకుడు జనార్దన్ జనసేన నాయకులను తరచుగా అవమానిస్తున్నప్పటికీ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల కార్యకర్తలు మనస్తాపం చెందుతున్నారు. పార్టీలో సాక్షాత్తూ మహిళపై దాడి జరిగినా అధిష్టానం స్పందించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాడిని పట్టించుకోని జనార్దన్...

జనసేనలో గ్రూపుల గొడవలను దామచర్ల జనార్దన్ రాజేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జనసేనలో జరుగుతున్న గ్రూపు తగాదాల్లో ఆయన ఒక గ్రూపును ప్రోత్సహిస్తున్నారన్న సంగతి తెలిసిందే. అరుణ మీద దాడి జరిగిన తరువాత చికిత్స కోసం ఆమె నేరుగా జీజీహెచ్‌కు వచ్చారు. అరుణ మీద జరిగిన దాడిని కనీస మర్యాదగా కూడా ఖండించలేదు. జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటున్నా అరుణను పరామర్శించలేదు. కావాలనే రియాజ్‌తో కలిసి సోమవారం జీజీహెచ్‌కు వచ్చిన ఆయన ఒక మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వెళ్లారు. ఒక ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మహిళ అని కూడా చూడకుండా ఆయన వ్యవహరించిన తీరుపట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిజానికి ఒంగోలు టీడీపీ అభ్యర్థిగా జనార్దన్ పేరును ప్రకటించిన వెంటనే ఆయన ఇంటికి వెళ్లి అరుణ అభినందించారు. అదికూడా జనార్దన్ పట్టించుకోకుండా రియాజ్ వర్గాన్ని వెనుకేసుకుంటూ వస్తున్నారని జనసేన కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

14న ఒంగోలులో జాబ్ మేళా

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో యాక్సిస్ బ్యాంక్, క్వార్ట్జ్ క్రాఫ్ట్ కంపెనీలలో పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి ఈనెల 14న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టీ భరద్వాజ తెలిపారు. బిజినెస్ డెవప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, మెషిన్ ఆపరేటర్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని చెప్పారు. పూర్తి వివరాలకు ఆఫీస్ సమయాల్లో 08592281776ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆధార్ తప్పనిసరి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఆధార్ తప్పనిసరి అని ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి.దేవానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఆధార్ మిస్‌మాచ్ అయినప్పటికీ బ్యాంకు పాస్‌బుక్ వివరాలు నమోదు చేయడం ద్వారా కొంతమంది విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉపకార వేతనం పొందగలిగారన్నారు. కానీ ఈ ఏడాది రెన్యువల్‌కు మాత్రం విద్యార్థి వివరాలు ఆధార్‌తో తప్పనిసరిగా సరిపోలాలన్నారు. ఇటువంటి విద్యార్థులు తమ వివరాన్నీ ఆధార్‌తో సరిపోయేలా సవరించుకుని ఈనెల 13వ తేదీలోపు స్టడీ సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్, పోర్టల్ అప్లికేషన్ జిరాక్స్ కాపీలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

న్యూస్‌రీల్

ఆధార్ కిట్స్ పంపిణీ చేసిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఐదు సచివాలయాలకు సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ చేతుల మీదుగా 5 ఆధార్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఒంగోలులో సచివాలయానికి 2, నాగులుప్పలపాడు 1, పొదిలి 1, గిద్దలూరు 1 చొప్పున పంపిణీ చేశారు. దీనిలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, సచివాయలాల నోడల్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 లైబ్రేరియన్ పోస్టులకు నియామక పత్రాలు

ఒంగోలు అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ లైబ్రేరియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీలో భాగంగా ఎస్సీ కేటగిరీలో కే సామ్సన్, ఎస్టీ కేటగిరీలో గోనావత్ రామంజి నాయక్‌లకు సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఈఓ సుభద్ర, జిల్లా పరిషత్ విద్యా అధికారి సామా సుబ్బారావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుసు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రూ.5.16 కోట్లతో మరుగు శుద్ధి వాహనాలు

ఒంగోలు సెంట్రల్: జిల్లా షెడ్యూల్డ్ కులాలు సేవా సహకార సంఘం ద్వారా 80 మంది లబ్ధిదారులకు 16 మరుగుశుద్ధి చేసే వాహనాలు మంజూరు చేసినట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ఈడీ కె అర్జున్ నాయక్ తెలిపారు. రూ.5,06,77,216 విలువైన 16 ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ), ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ, స్త్రీ నిధి ద్వారా మంజూరు చేసినట్లు చెప్పారు. ఈనెల 13న ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని 28 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ నిమిత్తం ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీహెచ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనాథలు, బడి బయట చిన్నారులు, బడి మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్య్ర రేఖకు దిగువన జీవిస్తున్న కుటుంబాల్లోని బాలికలు మాత్రమే అర్హులు. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నంబర్లకు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుందన్నారు. వివరాలకు ఆర్‌టీఈ టోల్ ఫ్రీ నంబర్ 18004258599 ను సంప్రదించాలన్నారు.

మహానేత పాలనే గుర్తొస్తుంది

- సచివాలయాల ప్రారంభోత్సవంలో మంత్రి మేరుగు నాగార్జున
- ఈదుమూడిలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

నాగులుప్పలపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూస్తుంటే మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన గుర్తొస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని నాగులుప్పలపాడు, ఈదుమూడి, కొత్తకోట గ్రామాల్లో సోమవారం సచివాలయాల భవనాలను, నాగులుప్పలపాడులో రూ.2 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలను గ్రామ స్థాయి వరకు తీసుకొచ్చారన్నారు. సచివాలయాలకు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల గుమ్మంలోకి తీసుకొచ్చి వారి ముఖాల్లో చిరునవ్వులకు జగన్ కారణమయ్యారని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు మంచి చేయాలన్న కృత నిశ్చయంతో పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మీద, ఆయన కలలు నిజం చేసిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ మీద ప్రతిపక్షాలతో పాటు ఎల్లో మీడియా నిత్యం విషం కక్కటం చాలా బాధాకరమన్నారు. రానున్న రోజుల్లో ప్రజానేత జగన్‌మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని ప్రజలను కోరారు.



ఈదుమూడిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, పరిశీలకుడు దేవినేని మల్లికార్జున

మహానేత విగ్రహావిష్కరణ

ఈదుమూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని సోమవారం రాత్రి మంత్రి మేరుగు నాగార్జున, నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లిఖార్జున రావు ఆవిష్కరించి, రాజన్న పాలన ఎంత గొప్పదో మనందరికీ కళ్లారా చూపించిన జగన్‌మోహనరెడ్డి పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, తిరిగి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలందరూ సిద్ధంగానే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ నల్లమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, నాగులుప్పలపాడు, ఈదుమూడి, కొత్తకోట గ్రామాల సర్పంచ్‌లు మందా హెప్సీరాణి, బోలే లక్ష్మీవీరాంజనేయులు, చిన్నం సుజాత సురేష్, ఎంపీటీసీలు మారెళ్ల రాజ్యలక్ష్మి, మున్నంగి రమ్య, ఎర్రమాల సుభాషిణి, లిడ్‌క్యాప్, శాలివాహన, హౌసింగ్, కార్పొరేషన్‌ల స్టేట్ డైరక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయకుమార్, నాయకులు పూనం పూర్ణచంద్రరావు, బోలినేని కోటేశ్వరరావు, కొమ్మూరి సుధాకర్, పులిచర్ల పరంధామరెడ్డి, యోహాను తదితరులు పాల్గొన్నారు.



మురళి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి

రూ.3 లక్షల తక్షణ సాయం

- సాయం అందజేసిన ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు: మేదరమెట్ల సిద్ధం సభలో ప్రమాదవశాత్తు మరణించిన యు.మురళి కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తక్షణ సాయంగా రూ.3 లక్షలు అందించారు. సోమవారం రాత్రి ఆయన మురళి ఇంటి వద్దకు చేరుకుని భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబీకులను పరామర్శించారు. అధైర్య పడవద్దని, తప్పకుండా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తక్షణసాయంగా రూ.3 లక్షలు అందించడంతోపాటు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. అంతే కాకుండా మృతుని భార్యకు ఉద్యోగం కల్పించడంతోపాటు వారికి ఇల్లు కూడా మంజూరు చేయిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1010 మంది గైర్హాజరు

ఒంగోలు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సోమవారం 1010 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణితం 2బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 15583 మందికి, 14897 మంది, ఒకేషనల్ విభాగంలో 2550 మందికి 2226 మంది హాజరయ్యారని ఆర్‌ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. జిల్లాలో పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక 50వ డివిజన్‌లోని మంగమ్మ కాలేజీ ఆవరణలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ఈ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల వుడ్‌కాంప్లెక్స్, శ్రీనగర్ కాలనీ, శ్రీరాం కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నేతాజీ కాలనీ, ఐటీఐ కాలేజీ, జయప్రకాష్ కాలనీల్లోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. దీనికింద 5700 మంది వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లయిందన్నారు. స్థలం కొరత వల్ల దీనిని నిర్మించుకోవడంలో జాప్యం జరిగిందని, అయితే స్థలం అప్పగించిన రెండు నెలల్లోనే రూ.4 కోట్ల విలువైన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తిచేయడం నిజంగా రికార్డే అన్నారు. ఈ డివిజన్‌లో ఇప్పటి వరకు మనం రూ.7.87 కోట్లు ఖర్చు చేయగలిగామన్నారు. సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం మన నియోజకవర్గంలో రూ.270 కోట్లు వెచ్చించారని, తద్వారా నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనేది తమ ఆకాంక్షలో భాగమన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్తపట్నంలో రూ.48 కోట్లతో విద్యుత్‌లైన్లు మార్చినట్లు చెప్పారు. ఒంగోలు పట్టణంలో 300 నుంచి 350 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ అంతరాయం అన్నదిలేకుండా చేశామన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు మాట్లాడుతూ సబ్ స్టేషన్ మంజూరై చాలాకాలం అయినా స్థలం సమస్య వల్ల నిర్మించడంలో జాప్యం జరిగిందన్నారు. తమ డివిజన్‌లో 686 మంది పేదలకు పట్టాలు లభించాయని, అదే విధంగా మరో రూ.2.50 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు కూడా రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు నాగిరెడ్డితోపాటు ఆపరేషన్స్ ఈఈ పి.శ్రీనివాసులు, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ టి.శ్రీనివాసరావు, ఆపరేషన్స్ డీఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి, డీఈఈ కనస్ట్రక్షన్స్ కె.అంజిరెడ్డి, ఏఈఈ టి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒక్క అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేసి చూపిస్తా

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

సింగరాయకొండ(మర్రిపూడి): ఒక్క అవకాశం ఇవ్వండి.. కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా... నేను చేతల మనిషిని కానీ మాటల మనిషిని కాను అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు, ×పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం× కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల కాలంలోనే నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో రుచిచూపించానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాకల గ్రామంలో సుమారు రూ.3.20 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. గ్రామంలో రూ.2.70 కోట్లతో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్లు ఒక్కొక్కటి రెండు చొప్పున నిర్మించి ప్రారంభించామని, రూ.50 లక్షలతో సిమెంటు నిర్మించామని వివరించారు. ఇంకా గ్రామంలో రోడ్లు, బీచ్, ఉప్పు కొఠారులు అభివృద్ధి చేయాల్సి ఉందని, వీటిని అభివృద్ధి చేసినట్లయితే యువతకు ఉపాధి లభిస్తుందని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో క్రాంతినగర్ లో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు, క్రాంతినగర్, చెల్లెమ్మగారిపట్టపుపాలెం, పోతయ్యగారి పట్టపుపాలెంలలో గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేశానని, మండలానికి సాగునీటి వనరైన పాలేరు–బిట్రగుంట స్కీము సప్లయ్ చానల్ అభివృద్ధి పనులు చేయించానని వివరించారు. తాను నిరంతరం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నానని వివరించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే స్వామికి మూడుసార్లు అవకాశం ఇచ్చారని, కానీ ఆయన నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. ఆయన తన వెనుక సత్యా ఉన్నాడు, కృష్ణుడు ఉన్నారని ధీమాతో ఉన్నారని.. కానీ నా వెనుక ప్రజాబలం, జగనన్న తోడుగా ఉన్నారని, వైఎస్సార్ అండ ఉందన్నారు. నేను తొలి కేబినెట్‌లో విద్యాశాఖా మంత్రి గా ఉన్నానని కొండపి నియోజకవర్గంలోని పాఠశాలలకు నాడు–నేడు పథకం కింద రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. నాకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గంలో ఉపాధి కల్పనతో పాటు విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు బస్టాండు సెంటర్ లో వైఎస్సార్, డాక్టర్ కోటారెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత గ్రామ సచివాలయం–2, ఆర్‌బీకే 2 నూతన భవనాలను ప్రారంభించారు. కార్యక్రమం జరుగుతుండగానే ప్రజల సమస్యలు వింటూ అర్జీలను పరిష్కరిస్తూ సురేష్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశవరపు కృష్టారెడ్డి, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్ రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కే అంకయ్య, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, ప్రళయకావేరి రోశయ్య, ప్రళయ కావేరి శివ, కుర్రు ప్రసన్నకుమార్, వాయిల తాతయ్య, వాయిల బుజ్జమ్మ, రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి రాపూరి ప్రభావతి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్, ఎంపీడీవో నగేష్‌కుమారి, పంచాయతీరాజ్ డీఈ రవిబాబు, ఏఈ కోట శ్రీహరి, ఈఓ సుభాని, కుర్రు కళ్యాణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పాకలలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

క్లుప్తంగా

స్పందన అర్జీలు నిర్దిష్ట గడువులో పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ శ్రీలత మరియు అధికారులు

ఒంగోలు అర్బన్‌: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల్లోని సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) ఆర్‌ శ్రీలత అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్‌ యువర్‌ కలెక్టర్‌ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందనలో 108 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలు పరిష్కరించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సమస్యల పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పుకోకుండా సేవలందించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందించే సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా పనిచేయాలన్నారు. దీనిలో స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, ఝాన్సీలక్ష్మి, లోకేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ‌ కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ డయల్‌ యువర్‌ కలెక్టర్‌కు ఫోన్‌ చేసి తాను కెనరా బ్యాంకు నుంచి రుణం తీసుకున్నానని తెలిపారు. అయితే రుణం చెల్లించినా పెనాల్టీ వేశారని ఫిర్యాదు చేశాడు. పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు. లీడ్‌ బ్యాంకు మేనేజర్‌కు సమస్యను పరిష్కరించాలని డీఆర్‌ఓ సూచించారు. ‌ పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు స్పందన అధికారులను కలిసి తన భూమిని ఆన్‌లైన్‌ చేయడం లేదని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశాడు. పరిశీలించి త్వరగా తన భూమిని ఆన్‌లైన్‌ చేయించాలని కోరాడు.



ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. సోమవారం సాయంత్రం మగరిబ్‌ నమాజు తర్వాత ముస్లింలు, వారి కుటుంబ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నెలవంకను దర్శించడంతో వరాల వసంతం రంజాన్‌ మాసం మొదలైంది. సోమవారం నుంచే ప్రత్యేక తరావీహ్‌ నమాజ్‌లు ప్రారంభమయ్యాయి. రాత్రి ఇషా నమాజు తరువాత 20 రకాత్‌ల తరావీహ్‌ నమాజును ఆచరించారు. పవిత్ర ఖురాన్‌ గ్రంథం ఈ నెలలోనే అవతరించిందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ నెలంతా నిష్టతో ఉపవాసాలను ఆచరిస్తూ అల్లాహ్‌ నామస్మరణతో గడుపుతారు. రోజూ ఐదు పూటలా నమాజ్‌ చేస్తారు. అత్యధిక సమయం ప్రార్థనల్లో నిమగ్నమవడమే కాకుండా దానధర్మాలు చేస్తారు.

వరాల వసంతం రంజాన్‌

ఒంగోలు టౌన్‌:

జిల్లాలో రంజాన్‌ హడావుడి మొదలైంది. మంగళవారం నుంచి రోజా దీక్షలు ప్రారంభం కానుండటంతో ముస్లింలు అందుకు అవసరమైన నిత్యావసర సరుకుల కోసం దుకాణాలకు క్యూకట్టారు. కిరాణా స్టోర్లు, సూపర్‌ మార్కెట్లు, డ్రై ఫ్రూట్స్‌ దుకాణాలు సోమవారం రద్దీగా కనిపించాయి. జిల్లాలో మొత్తం 480 మసీదులు ఉండగా ఒంగోలు నగరంలో 36 ఉన్నాయి. జిల్లాలో అనేక ప్రాంతాల్లో మసీదులను విద్యుత్‌ దీపాలతో ముస్తాబు చేశారు.

ఉపవాసం ఎందుకంటే..

ప్రపంచంలో ఎంతో మంది నిరుపేదలు, నిర్భాగ్యులు ఉన్నారు. కనీసం ఒక పూట కూడా గడవని వారు, ఆకలితో ప్రాణాలు విడుస్తున్న అభాగ్యులు ఉన్నారు. వారి ఆకలి దప్పుల బాధ ప్రతి ఒక్కరికీ అర్థం కావాల్సిన అవసరం ఉంది. అందుకే ఏడాదిలో ఒకనెల ఆకలిదప్పులతో జీవించాలన్న ఉద్దేశంతో ఉపవాసాలను తప్పనిసరి చేశారు. తెల్లవారుజామున 5 గంటల్లోపే సహరీ చేస్తారు. పగలంతా ఎలాంటి ఆహారం కానీ పచ్చి మంచినీళ్లు కానీ ముట్టుకోకుండా ఉంటారు. సాయంత్రం 6.30కు ఇఫ్తార్‌తో ఆ రోజా ముగిస్తారు. అంటే రోజు మొత్తం మీద సుమారు 13 గంటలపాటు ఆహారం తీసుకోకుండా నిష్టగా ఉంటారు. అయితే ఇది ఒక కోణం మాత్రమే. రోజా అంటే కేవలం ఆకలిదప్పులతో ఉండటమే కాదు. శరీరంలోని ప్రతి అవయవం రోజా ఉండాలి. అంటే చెడు చూడకూడదు. అబద్ధాలు మాట్లాడకూడదు. నిత్య జీవితంలో అన్ని విషయాల్లోనూ నిజాయితీగా ఉండాలి. నిబద్ధతతో ఉండాలి. నెల రోజుల దీక్షల తరువాత దాని స్ఫూర్తితో మిగిలిన 11 నెలలు కూడా జీవించాలి. అప్పుడే నిజమైన రోజా ఉద్దేశం నెరవేరినట్లు అవుతుందని మత పెద్దలు చెబుతున్నారు.

తరావీహ్‌లో ఖురాన్‌ పఠనం

రంజాన్‌ మాసంలో ప్రత్యేకమైన తరావీహ్‌ నమాజ్‌ చేయాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. రాత్రి ఇషా తర్వాత 20 రకాత్‌ల నమాజ్‌ చదివిస్తారు. ఆకాశంలో నెలవంక కనిపించినప్పటి నుంచి తరావీహ్‌ నమాజ్‌ చదవడం మొదలు పెడతారు. రంజాన్‌ మాసం ముగింపులో నెలవంక దర్శనమిచ్చిన తర్వాత తరావీహ్‌ నమాజులను విరమిస్తారు. 30 రోజుల ఈ నమాజులో పూర్తిగా పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పఠిస్తారు. అందుకే ప్రతి ముస్లిం తరావీహ్‌ ఆచరిస్తారు.

మర్కస్‌ మజీద్‌లో సహరీకి ఏర్పాట్లు

విద్యార్థులు, ఉద్యోగులు తెల్లవారుజామున సహరీ ఏర్పాటు చేసుకోవడం కుదరదు. అలాంటి వారి కోసం ఒంగోలులోని మర్కస్‌ మజీద్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సహరీ అవసరమైనవారు మసీద్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని మత పెద్దలు సూచించారు.

మహిళలు లక్షాధికారులు కావాలి

● కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలతో ప్రధాని మోదీ సోమవారం వీడియో సమావేశం నిర్వహించగా ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ గోపాలకృష్ణ హాజరయ్యారు. 1,375 సంఘాల లఖ్‌పతి దీదీలకు రూ.118.21 కోట్లు, 14 సంఘాల లఖ్‌పతి దీదీలకు రూ.20 లక్షల సీఐఎఫ్‌–వీఆర్‌ఎఫ్‌ రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళల కుటుంబాలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించి ఏడాదికి లక్ష రూపాయలకు పైగా నికర ఆదాయం వచ్చేలా చూసేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఉన్నతి పథకాల ద్వారా వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి విడతగా లక్ష మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు. విజయవంతంగా వ్యాపారంలో రాణిస్తున్న 20 మంది మహిళలకు కలెక్టర్‌ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా శ్రీనివాసరెడ్డి



ఒంగోలు సిటీ: జిల్లా సహకార అధికారిగా శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వం డిప్యూటీ రిజిస్ట్రార్లకు స్పెషల్‌ క్యాడర్‌ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా ప్రమోషన్లు కల్పించింది. ఈక్రమంలో జిల్లాకు బి.శ్రీనివాసరెడ్డిని జిల్లా సహకార అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాసరెడ్డి 1995లో అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌గా డిపార్ట్‌మెంట్‌లో చేరారు. 2007లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్‌ పొందారు. ప్రస్తుతం ఈయనం రాజమండ్రి సహకార కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

ఏపీ సీనియర్‌ మహిళల హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్‌



ఒంగోలు: ఏపీ సీనియర్‌ మహిళల హాకీ జట్టు మేనేజర్‌గా సంతనూతలపాడు మండలం మైనంపాడులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీగా పనిచేస్తున్న తిరుమలశెట్టి రవికుమార్‌ నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 13 నుంచి 23వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణేలో జరిగే సీనియర్‌ మహిళల జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు ఈయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు సహ ఉపాధ్యాయులు, హాకీ అసోసియేషన్‌ ప్రతినిధులు తదితరులు అభినందనలు తెలిపారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.23.92 లక్షలు



సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.23.92 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్‌ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చీఫ్‌ ఫెస్టివల్‌ ఆఫీసర్‌ బి.రమేష్‌ తెలిపారు. సోమవారం స్థానిక ఆలయ ప్రాంగణ భవనంలో హుండీ కానుకలు లెక్కించారు. కానుకల రూపంలో రూ.13,64,996, టిక్కెట్ల విక్రయంతో రూ.1,98,160, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.2,05,800, అన్నదానానికి విరాళంగా రూ.3,43,267, మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.84,598, ఉభయదాతల విరాళాల కింద రూ.1,80,696, కల్యాణ చదివింపుల ద్వారా రూ..14,940 వెరసి మొత్తం రూ.23,92,457 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

ఉత్సాహంగా ఒంగోలు జాతి ఎడ్ల పందేలు

త్రిపురాంతకం: మహాశివరాత్రి సందర్భంగా పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పందేలు ఆకట్టుకున్నాయి. త్రిపురాంతకంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పందేలు ఆసాంతం ఆసక్తిగా జరిగాయి. విజేతలుగా నిలిచిన వారికి ప్రైజ్‌మనీ అందజేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పీఆర్‌ మెమోరియల్‌ పులగం త్రిశఘ్నరెడ్డి జస్విత రెడ్డి మొదటి బహుమతి సాధించగా రూ.లక్షను వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి అందజేశారు. రెండో బహుమతి కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన ఎంకేఎం బుల్స్‌ మేకా కృష్ణమోహన్‌ సాధించగా మార్కెట్‌ యార్డు చైర్మన్‌ సింగారెడ్డి నాగమణి పోలిరెడ్డి, ఎంపీటీసీ పీ కృష్ణ రూ.80 వేలు ఇచ్చారు. మూడో బహుమతిని బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పీవీఎస్‌ఆర్‌ బుల్స్‌ పావులూరి వీరస్వామి చౌదరికి ఆలయాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ ఐవీ సుబ్బారావు రూ.60 వేలు బహూకరించారు. నాలుగో బహుమతి పీఆర్‌ మెమోరియల్‌ దూపాటి సందీప్‌ శర్మకు రూ.50 వేలు, ఐదో బహుమతి మార్టూరు ఎంకేఎం బుల్స్‌ శ్రీనివాసరావుకు వాణీరమా స్కూల్‌ రూ.40 వేలు, ఆరో బహుమతి ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేట గ్రామం మీనిగ కాశయ్యకు త్రిపురాంతకం గ్రామసర్పంచ్‌ పీ వెంకటలక్ష్మి రూ.30 వేలు అందజేశారు. ఏడో బహుమతి గుంటూరు రూరల్‌ లింగాయపాలెం ఎల్లం సాంబశివరావుకు కందుల శ్రీనివాసరెడ్డి రూ.25 వేలు, ఎనిమిదో బహుమతి బాపట్ల జిల్లా బల్లికురవ వీరయ్య చౌదరి ప్రైజ్‌ మనీ సాధించగా ఇమ్మడిశెట్టి క్రిష్ణయ్య రూ.20 వేలు అందజేశారు. త్రిపురాంతకం తిరునాళ్ల ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి

వృద్ధురాలి మృతిపై విచారణ వేగవంతం



స్థానికులను విచారిస్తున్న ట్రైనీ డీఎస్పీ షహబాజ్‌ అహ్మద్‌



మృతదేహం ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

అర్ధవీడు(కంభం): అర్ధవీడులో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహాన్ని ఆదివారం గుర్తించిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పత్తిపాటి వెంకట లక్ష్మమ్మ(63) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి మరుగుదొడ్డిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం డాగ్‌ స్క్వాడ్‌, క్లూస్‌ టీమ్‌ను రంగంలోకి దించిన పోలీసులు సంఘటనా స్థలాన్ని జల్లెడ పట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులను ట్రైనీ డీఎస్పీ షహబాజ్‌ అహ్మద్‌, కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై అనిత విచారించారు. శుక్రవారం సాయంత్రం గేదెలకు మేతగా చెరకు పిప్పి తెచ్చేందుకు బస్టాండ్‌ వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతదేహంపై దుస్తులు లేకపోవడంతో అత్యాచారం చేసి హతమార్చారా లేదా ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమస్యలపై దృష్టి సారించండి

● కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

ఒంగోలు అర్బన్‌: కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు చర్చించిన సమస్యలను పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అజెండా అంశాలకు సంబంధించి సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు నోట్‌ చేసుకుని ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు. పరిష్కరించిన సమస్యలను సభ్యులకు తెలపాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులకు సూచించారు. నగరంలో సుమారు 4 లక్షల మందికి తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో ఆహార సలహా మండలి సమావేశాలు, సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, నగర మేయర్‌ గంగాడ సుజాత, దిశ కమిటీ సభ్యులు సోము వీరాంజనేయరెడ్డి, చంద్రకాంత్‌, దుగ్గిరాల వేంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ మర్దన్‌ అలీ, పంచాయతీరాజ్‌ ఎస్‌ఈ కొండయ్య, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్‌, మెప్మా, ఐసీడీఎస్‌ పీడీలు రాజగోపాల్‌, వసుంధర, పేరయ్య, రవికుమార్‌, మాధురి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

బైక్‌ అదుపు తప్పి ఇద్దరు యువకులు మృతి





ప్రమాదంలో మృతి చెందిన రొమారియో, సుశాంత్‌



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగేశ్వరరావు

● మరో యువకుడికి తీవ్ర గాయాలు

టంగుటూరు: బైక్‌ అదుపు తప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంకో యువకుడు ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి పొద్దుపోయాక టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం సమీపంలో కోళ్ల ఫారాల వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన యువకులు రొమారియో, సుశాంత్‌, సూర్య కొత్తపట్నం మండలం మడనూరులో తిరునాళ్లకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యంలో సూరారెడ్డిపాలెం సమీపంలోని కోళ్ల ఫారం వద్ద బైక్‌ అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టడంతో పైనం రొమారియో(20) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వేగంగా స్పందించి తీవ్రంగా గాయపడిన దార్ల సుశాంత్‌, సూర్యను చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సుశాంత్‌(18)ను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒంగోలులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూర్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడటం, మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై నాగేశ్వరరావు సోమవారం ఉదయం పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం యువకుల మృతదేహాలను కుటుంబ సభ్యులను అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చికిత్స పొందుతున్న సూర్య

రాష్ట్ర ప్రయోజనాలు బీజేపీకి తాకట్టు

● టీడీపీ, జనసేన తీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం

ఒంగోలు సెంట్రల్‌: రాష్ట్రాన్ని నిలువునా ముంచిన బీజేపీతో టీడీపీ, జనసేన ఎందుకు జట్టు కట్టాయో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ వద్ద తాకట్టు పెట్టేలా టీడీపీ, జనసేన అడుగులు వేయడాన్ని తప్పుబట్టారు. సీపీఐ ప్రకాశం జిల్లా విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో అన్ని రాజకీయ పార్టీలను బెదిరించి, బ్లాక్‌ మెయిల్‌ చేయడం ద్వారా బీజేపీ ఎన్నికలకు సిద్ధమవుతోందని విమర్శించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో చెప్పుకోదగ్గ ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాకపోగా ఉన్నవి మూతపడ్డాయని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ఎన్నికల హామీని ప్రధాని మోదీ ఏనాడో మరిచిపోయారని విమర్శించారు. ఇప్పటికే ఎల్‌ఐసీ, రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లను ప్రైవేట్‌ పరం చేశారని ధ్వజమెత్తారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వడం లేదన్నారు. అన్నదాతలపై ఆంక్షలు విధిస్తూ ఉగ్రవాదుల కన్నా హీనంగా దాడి చేయిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. చట్ట సభల్లో కమ్యూనిస్టులు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్‌ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌.వెంకటరావు, ఎస్‌డీ యాసిన్‌ తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన 11 కేవీ విద్యుత్‌ తీగ

● పశుగ్రాసం, డ్రిప్‌ పైపులు దగ్ధం

దొనకొండ: దొనకొండ నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలోని పొలాల్లో 11 కేవీ విద్యుత్‌ తీగ సోమవారం ఉదయం తెగి పడింది. రైతులు పాతకోట దివాకరరెడ్డి, పాతకోట పుల్లారెడ్డికి చెందిన పశుగ్రాసం, విద్యుత్‌ తీగలు, డ్రిప్‌ పైపులు, మోటార్లు మంటల్లో కాలిపోయాయి. పశువుల కాపరుల ద్వారా సమాచారం అందుకున్న బాధితులు మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం సంభవించిందని, నష్ట పరిహారం అందేలా విద్యుత్‌ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

ఆత్మగౌరవం నింపేలా ప్రభుత్వ ఉత్తర్వులు

● నూర్‌బాషా కులస్తుల హర్షం

ఒంగోలు: రాష్ట్రంలోని 25 లక్షల మంది నూర్‌బాషా కులస్తుల్లో ఆత్మగౌరవం నింపేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర నూర్‌బాషా యువత విభాగం అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీనుబాషా హర్షం వ్యక్తం చేశారు. నూర్‌బాషాలను ''దూదేకు, పింజారి, లద్దాఫ్‌, సగం సాయిబు, పింజారి ముఖం'' లాంటి అసభ్య పదాలతో విమర్శిస్తే భారతీయ శిక్షాస్మృతి కింద చర్యలు తప్పవని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తమ ఆత్మ గౌరవాన్ని కాపాడినట్లయిందన్నారు. నూర్‌బాషాల తరఫున సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.